

# అద్వైతం

భానుమూర్తి చటుక్కున లేచి కూర్చున్నాడు. ఇది గమనించి అతడి ప్రత్యర్థి చప్పున సుస్థిర స్థావరంలోకి వెళ్ళిపోయి తలబైటికి పెట్టి చూసింది.

చేతిని క్రిందికి నెమ్మదిగా జార్చి చప్పుడు కాకుండా రూళ్ళకర్ర తీసుకున్నాడు. బలం అంతా వేళ్ళ కొనల్లోకి తీసుకొని మెరుపుకన్నా ఎక్కువ వేగంతో విసిరేడు.

ఢాం.... ధడ్.... ధడ్..... దడా.....

క్లింక్ క్లింక్ ....

శత్రుస్థావరంలో అందరూ నిద్రపోతున్నప్పుడు అకస్మాత్తుగా పడిన బాంబుల శబ్ధం లాంటి చప్పుడు ఆ గదిలో ఆగకుండా వినిపించింది.

సీత కెవ్వున అరచి లేచికూర్చుంది. ఎక్కడో పన్నెండు కొట్టింది.

ఎలుక కన్నానికి ప్రక్కన అత్తగారిచ్చిన బాల్చీ బోర్లించి వుంది. దానిమీద చిట్టి పాప పాలడబ్బా ఒకదానిమీద ఒకటి పేర్చి వున్నాయి. ఆపైన స్టీల్‌గిన్నె, దాన్లో పాలూ, దానిమీద ఇత్తడి పళ్ళెమూ, ఆ పళ్ళెం మీద సీత సాయంత్రం వదిలేసిన పౌడరు డబ్బా వున్నాయి.

భానుమూర్తి చేతిలోంచి బాణంలా వెలువడిన రూళ్ళకర్ర గురితప్పి బాల్చీకి తగిలి, అది స్థానభ్రంశం పొందింది.

అరక్షణంలో అక్కడి పరిస్థితి మారిపోయింది. క్రింద గచ్చుమీద పాలు చిన్న సరోవరంలా మధ్య పౌడరుడబ్బా పడవలా అటూ ఇటూ వూగుతూ ఆగడానికి ప్రయత్నిస్తోంది. శత్రుసైనికులు అందరూ చచ్చిపోయాక మిగిలిన స్మశాన నిశ్శబ్దం ఆ గదిలో పేరుకొంది.

భానుమూర్తి బిక్కమొహంవేసి భార్యవైపు చూసేడు. సీత కళ్ళను చిన్నవిచేసి తనని మింగేసేలా చూస్తూ ఉండటం గమనించి మరింత కుదించుకుపోయేడు. అతడికామె కళ్ళని మామూలుగా ఉన్నప్పుడు చూస్తేనే భయం. గోధుమ రంగులోవున్న ఆపిల్లికళ్ళు చికాకుగానీ, కోపంగానీ వస్తే మరింత తీక్షణమై తనని భస్మం చేస్తున్నట్టు వుంటుంది.

అదృష్టవశాత్తు ఆమె మాట్లాడలేదు. తనలో తనే ఏదో గొణుక్కుంటుంది. భానుమూర్తి కూతురుమీద చెయ్యివేసి పడుకున్నాడు. రెండు నిమిషాల తరువాత చప్పుడయినా కళ్ళు తెరవలేదు. ఇంట్లో తిష్టవేసిన అతిధిలా ఆ ఎలుక క్రిందపడ్డ పాలని ఆరగిస్తోందని గ్రహించి, 'ఈరోజు గడిచిపోయిందని సంబరపడకు, నీ పని రేపు' అనుకున్నాడు కసిగా.

ఈసారి, కొంచెం అలస్యంగా నడిచే గడియారం పన్నెండు కొట్టింది.

* * *

క్రితంరాత్రి ఎలుక చేసిన గొడవతో బద్ధకంగా పడుకున్న వాడ్ని సీత హడావుడిగా లేపుతూ, "ఎవడో ఇంటిముందుకొచ్చి గొడవచేస్తున్నాడండీ" అంది కంగారుగా. అతడికి ఏమీ అర్ధంకాక తొందర తొందరగా బైటకొచ్చేడు. బైట కేకలు పెడ్తున్న వ్యక్తిని చూడగానే అతడి మొహం తెల్లగా పాలిపోయింది. కాకీ డ్రస్సులో గండుపిల్లిలా ఉన్నాడు కాబూలీవాడు.

భానుమూర్తిని చూడగానే అతను మరింత గట్టిగా కేకలు పెడ్తూ "ఏమయ్యా, రెండునెలలుగా ఇయాల - రేపు - అంటున్నావే - పట్కోలేననుకున్నావా?" అంటూ రేగిపోయాడు.

ఆఫీసుకు వాడు రావటం సర్వసామాన్యమయి పోయి, ఎవరూ పట్టించుకోక పోవటంవల్ల ఈ కొత్తపంధా మొదలు పెట్టాడని వూహించిన భానుమూర్తికి కాళ్ళూ, చేతులూ ఆడలేదు, బిక్కచచ్చిపోయి నిలబడ్డాడు.

అరుగులమీద నిల్చొని, కిటకీల్లోంచి అందరూ తననే చూస్తూ వుండటం గమనించి,

మరింత కుదించుకుపోయేడు.

ఎదురుగా కాబూలీవాడు గాలిలోకి చేతులు విసుర్తూ అరుస్తున్నాడు. అలా అరుస్తున్నప్పుడు అతని గుబురుమీసాలు చిత్రంగా కదుల్తుతున్నాయి. కాని భానుమూర్తి ఆ చిత్రాన్ని చూసేస్థితిలో లేడు. భూమి రెండుగా చీలిపోయి తను అందులోకి దిగిపోతే బాగుండునని అనుకుంటున్నాడు.

అయిదు నిమిషాలపాటు స్వైరవిహారం జరిగేక దేవుడు పంపినట్టు పక్కింటాయన భానుమూర్తిని ఆదుకున్నాడు.

"మొత్తం ఎంత యివ్వాలి బాబూ!"

"అసలు వంద, వడ్డీ రెండొందలు."

వాడికో నూటయాభై ఇచ్చి తాత్కాలికంగా సంతృప్తిపరచి, పంపేసి. భానుమూర్తి వైపు తిరిగి, "వీళ్ళు చేతుల్లో చిక్కుకోకూడదండీ. ఒకసారి దొరికితే పీల్చి పిప్పిచేస్తారు" అన్నాడు.

అసలే ఉక్రోషంగా వున్నాడేమో. భానుమూర్తికి ఈ మాటలతో మరింత వళ్ళు మండింది. ఆ విషయం తెలియక కాదులెండి.... అవసరం.... అందామనుకొని తనని ఈ విపత్కర పరిస్థితి నుంచి రక్షించింది ఆయనే అన్న విషయం గుర్తుకొచ్చి ఏమీ అన్లేక లోపలికి వచ్చేశాడు.

ఈ కాబూలీవాడి గొడవతో వికలమైన మనసు సర్దుకోవటానికి మూడు నాలుగు గంటలు పట్టింది.

ఆఫీసులో ఈ టాపిక్ వచ్చింది.

"ఇలాంటి విషయాలన్నీ కొత్తేమో, ఒకసారి పాతబడితే ఏవీ వుండవు. గుమాస్తాలుగా పుట్టిన నేరానికి, ఇవి అనుభవించాల్సిందే" అంటూ నవ్వేడు భాస్కరరావు.

"మనం పిల్లిలా వున్నకొద్దీ మరీ పేట్రేగి పోతారు వాళ్ళు" అన్నాడు హనుమంతరావు.

దీనితో టాపిక్ మారింది.

"రెండ్నెల్లనుంచీ ఒకే ఒక ఎలుక, తెగ బాధపెట్టెస్తోందోయ్." అన్నాడు భానుమూర్తి.

హనుమంతరావు నవ్వేడు - "ఒక ఎలుకను చంపలేవా?"

అన్నట్టుంది ఆ నవ్వు.

"మా ఇంట్లో ఎలుకలు కాళ్ళమధ్యనుంచే పాకివెళ్ళేవి. ఒక్కసారి మందు పెట్టాను. దెబ్బకి అన్నీ స్మాష్-" అన్నాడు భాస్కర్రావు.

"ఎలుకల మందు ప్రమాదకరం. దానికన్నా బోనుమంచిది."

"ఆ పనీ చేసేను" అన్నాడు భానుమూర్తి.

"బోనులోకూడా చాలా రకాలుంటాయ్. కొన్ని బోన్లలోకి ఎలుకలు ఈజీగా ఎట్రాక్ట్ అవుతాయి.

"లోపలికి రావటం సమస్య కాదు. రాగానే మరి బైటకు వెళ్ళనివ్వకుండా టపామని తలుపు పడాలి. అదీ మంచి బోను లక్ష్యం" అని భానుమూర్తివైపు తిరిగి - "మా ఇంట్లోది

తీసుకువెళ్ళి ట్రై చెయ్యవోయ్" అన్నాడు.

ఇంతలో ప్యూనువచ్చి ఆఫీసరు పిలుస్తున్నాడని భానుమూర్తికి చెప్పేడు. అతడు రూమ్‌లోకి వెళ్ళేసరికి, ఆఫీసరు కోపంతో ఫైలు అతడి మొహంమీద కొట్టినంత పనిచేసి, "ఏమిటయ్యా ఇవి వళ్ళు దగ్గరపెట్టుకునే ఈ డ్రాఫ్టు వ్రాసేవా? 'రయిట్స్' అని ఉన్నచోటల్లా 'రాట్' అని వ్రాస్తావా? నీ ఉద్దేశ్యం భూమిని దున్నేది రైతులా లేక ఎలుకలా?"...... పనిమీద యిష్టం లేకపోతే రిజైనుచేసి వెళ్ళు" అంటూ చెడామడాతిట్టాడు. ఆయన తిట్టటం కంప్లీటు అయ్యాక, ఫైలు తీసుకుని బైటకి వచ్చేడు. హనుమంతరావు, భాస్కరరావు అతనివైపు జాలిగా చూసేరు. భానుమూర్తి జీవంలేని నవ్వు ఒకటి నవ్వి, తన సీట్లో వచ్చి కూర్చొని ఫైలు విప్పేడు. ఎంత సమయం గడిచిందో తెలీదు.

డ్రాఫ్ట్ తిరిగి రాయడం దాదాపు పూర్తి చేస్తూవుండగా బల్లదగ్గిర అలికిడి అయితే తలెత్తి చూసేడు. ప్యూను...."పోదామా సార్".... అన్నాడు. అప్పుడు చూసుకున్నాడు టైము. ఆరయింది. "ఓ" అనుకుని సీటు కట్టేసి లేచాడు. ఆఫీసు నిర్మానుష్యంగా, షో అయిపోయిన తరువాత సర్కస్‌లా వుంది.

వరండాదాటి బైటికి వచ్చేడు. వెనుకే ప్యూను కూడా వచ్చి తలుపులు దగ్గిరగాలాగి తాళం వేస్తున్నాడు.

వరండా చుట్టూ బలంగా, నిటారుగా వున్న నల్లటి వూచలు చీకట్లో మెరుస్తున్నాయి. కటకటాల తలుపుకి తాళం బలంగా పడిందో, లేదో చూస్తున్నాడు ప్యూను. ఆ ఆఫీసు ఎలకల బోనులా వుంది.

భాస్కరరావు దగ్గర బోను తీసుకొని ఇంటికివెళ్ళేసరికి ఏడయింది. ఎందుకో తెలీదు గానీ, ఆ బోను తీసుకోగానే భానుమూర్తికి ఏదో రిలీఫ్ కలిగింది.

వీధిలైట్ల వెల్తుర్లో బోను నల్లటి పూచలు మెరుస్తున్నాయి. లోపల కొక్కెం ఉరిత్రాడులా అటూ ఇటూ వూగుతోంది. అతడికి తన ఆఫీసు వరండా గుర్తొచ్చింది.

అతడు ఇంటికి చేరుకునేసరికి, చిట్టి గుమ్మం దగ్గిరుంది. పరుగెత్తుకుంటూ వచ్చి, "నాన్న, అమ్మ చీరె కొనుక్కొంది" అంది. ఓ గొప్ప విషయాన్ని అనౌన్సు చేస్తున్నట్టు. భానుమూర్తి "ఏమిటి" అని అడిగే లోపులోనే లోపల్నుంచి సీత మొహం అంతా నవ్వు పులుముకొని వస్తూ,"నాన్నని లోపలికి రానియ్యవే వెధవదానా. పితురీలు తరువాత చెబ్దూగాన్లే" అంది.

"ఏమిటే సంగతి-" అడిగాడు అర్థం కానట్లు.

"ముందు స్నానం చెయ్యండి" అంది సీత - అతడు విప్పిన చొక్కా ఆప్యాయంగా అందుకుంటూ.

స్నానంచేసి భోంచేస్తున్నప్పుడు చెప్పింది - మధ్యాహ్నం పక్కింటి సుబ్బమ్మగారూ, తనూ కలిసి బజారు కెళ్ళేము. ఆవిడ మూడు చీరెలు తీసుకుంది. తననీ ఓ చీరె కొనుక్కోమని ఆవిడ మరీ బలవంతం చేస్తే....

"డబ్బెక్కడిదీ?-"

సీత ముసిముసిగా నవ్వుతూ "పొద్దున మీరెళ్ళేక మీ పెట్టెసర్దుతూ వుంటే బట్టల్లో దొరికింది- " అంది.

భానుమూర్తి మొహం తెల్లగా పాలిపోయింది. "అదా" అన్నాడు అస్పష్టంగా.

.....చెల్లెలు తన ఆర్థిక పరిస్థితి ఏమీ బాగోలేదని ఉత్తరాలమీద ఉత్తరాలు వ్రాస్తే చివరికి కాబూలీవాడికి ఇవ్వకుండా దాచుకున్న ఆ నలభై రూపాయలు-

ఉన్న కొద్ది అన్నంలో మజ్జిగ కలిపేసుకొని లేచిపోయేడు.

భోజనం చెయ్యగానే కూతుర్ని ఎదలో పెట్టుకుని కథలు చెప్పటం అలవాటు అతనికి.

సీత లోపల పన్లు చేసుకొంటోంది.

ఆ రోజు తండ్రి ఏవీ మాట్లాడకుండా పడుకోవటం చూసి, చిట్టి అతని పక్కలో లేచి కూర్చుంటూ "కథ చెప్పవా నాన్నా" అంది. భానుమూర్తి ఆలోచనల్లోంచి తేరుకుని, "ఏం చెప్పనమ్మా" అన్నాడు.

"ప్రతిరోజు చేప్తావుగా"

భానుమూర్తి నవ్వి "ప్రతిరోజు నేనే నేమిటి? ఈ రోజు నువ్వు చెప్పాలి" - అన్నాడు,

అమె తన చిన్న పిడికిళ్ళతో అతడి గుండెల మీద వెంట్రుకల్ని పట్టుకుని లాగుతూ, "అమ్మని గౌను కొనమంటే కొన్లేదు నాన్నా. డబ్బంతా పెట్టి తనకి చీరె కొనేసుకుంది" అంది.

బుజ్జగిస్తున్నట్టూ "పోన్లే అమ్మా! మనిద్దరం వెళ్ళి రేపు కొనుక్కుందాం సరేనా!" అన్నాడు.

కొంచెంసేపు మౌనంగా వుండిపోయింది.

"నాన్నా"

"ఏమ్మా"

"నీ కసలెప్పుడూ కోపం రాదా నాన్నా!"

భానుమూర్తి చకితుడై కూతురు మొహంలోకి చూసి, క్షణంలో తెప్పరిల్లి, తేలిగ్గా నవ్వేస్తూ "చిన్నపిల్లలు అంతలేసి ప్రశ్నలు అడగ కూడదమ్మా" అన్నాడు.

ఇంతలో లోపల్నించి సీత "ఈ బోనేమిటి"? అని అరచింది. భానుమూర్తి ఒక్క ఉదుటున లోపలికి వెళ్ళి బోనుతోపాటు దోసముక్కని తెచ్చి, ఎలుకకన్నానికి ప్రక్కగా పెట్టేడు. హుక్‌కి దోసముక్కని జాగ్రత్తగా అమర్చేడు.

తండ్రిచేసే పనిని చూస్తూ చూస్తూ చిట్టి నిద్రపోయింది.

అతడు దుప్పటి సర్దుతుండగా సీత కొత్తచీరె కట్టుకొని వచ్చింది. ఆమెతోపాటు దవనం పరిమళాన్ని కూడా తెచ్చింది. చిట్టిని తీసి పక్కగా పడుకోబెట్టి, అతని పక్కలో కూర్చుంటూ, "ఏమిటలా చూస్తున్నారు" అంది.

కొత్త చీరెకొన్నదన్న భావం అది కట్టుకోగానే పోయింది.

"ఈరోజే కట్టేసుకొన్నావేం - పండగకి ఉంచుకోలేక పోయావా" అన్నాడు. ఆమె అతడి పక్కలో సర్దుకుంటూ, "పోన్లెద్దురూ మీ కన్నా ఎక్కువా ఏమిటీ పండుగ" అంది.

"పండగకి ఇంకో చీరకోసం చేసే ప్రయత్నం కాదు కదా ఇది" అందామని మళ్ళీ ఆమెకి కోపంవస్తే, కొత్తచీర కట్టుకొన్న రాత్రి కూడా మామూలు రాత్రుళ్ళులాగే గడిచిపోతుందని భయంవేసి మాట మార్చి "మనం ఇలా మాట్లాడుకొని చాల కాలం అయింది కదూ-" అన్నాడు.

సీత మట్లాడలేదు.

....పెళ్ళయి ఆరేడేళ్ళు కాలేదు. అయినా మరీ క్యాజువల్ అయిపోయినట్టుంది.

"మీరు ఆఫీసు నుంచి వచ్చేసరికి రాత్రి ఎనిమిది అవుతోంది. పనెక్కువ అవటంవల్ల అలిసిపోతున్నారు కూడా."

అతను నవ్వి "స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్" అన్నాడు.

అంతలో టప్‌మని చప్పుడయింది.

తలుపు పడిపోయి వుంది కానీ లోపల ఎలుక లేదు. బోనుని కసిగా కాల్తో లాగి పెట్టి తన్నేడు.

"ముక్కని బైట్నుంచే కదిపి వుంటుందండి" భానుమూర్తి మళ్ళీ అమరుస్తోంటే అంది "ఒకటే ఎలుక భలే సతాయిస్తోంది"

"ఇంకెంత - ఒక్కరోజు -" కలుగువైపు చూస్తూ అన్నాడు.

"చంపకండి దూరంగా ఎక్కడన్నా వదిలెయ్యండి-"

దాన్ని ఏం చెయ్యాలీ అన్న దానిమీద అతని అభిప్రాయం వేరు. అందుకని టాపిక్ మారుస్తూ "ఈసారి పురుడు యిక్కడే పోసుకుంటావా..." అని అడిగేడు.

"ఇంకో ఆర్నెల్ల తరువాత మాట కదా" అని మళ్ళీ సీత అంది. "మంచి పళ్ళూ, టానిక్స్ వాడకపోతే చిట్టిలాగే ఎలుక పిల్లలా పుడ్తుంది.

"ఇదిగో-విప్లవం వస్తుందంటున్నారుగా చూద్దాం" అన్నాడు సీరియస్‌గా ఆలోచిస్తూ.

"అంటే-"

"అంటే-అంటే- అదే అదొస్తే అన్నీ దొరుకుతాయట" అన్నాడు తడబడి.

తరువాత సబ్జెక్టు చిట్టిని స్కూల్లో చేర్పించే విషయం మీదకూ, అట్నుంచి తీర్చవలసిన బాకీలూ, సీత ఎడమ పక్క రొమ్ములో అప్పుడప్పుడు వచ్చే నొప్పి గుండెకి సంబంధించింది కాదని పరస్పరం ఏకీభవించడం మీదుగా సాగి, వచ్చే జీతంలో కొద్దిగా టానిక్‌లకి కేటాయించాలని నిర్ణయం జరిగేక, తన ఇంక్రిమెంటు ఎప్పుడొస్తుందో, ప్రమోషన్ లిస్టులో తనెక్కడ ఉన్నాడో, అతడు వివరిస్తూ వుండగా, సీత సన్నగా గురక పెట్టడం ద్వారా - ఆ సంభాషణ ఆగిపోయింది. కొత్త చీరె పర్పస్ సర్వ్ అవలేదు.

భానుమూర్తి బోనువైపు చూసి, అది తెరిచే ఉండటం గమనించి, కాళ్ళదగ్గిర దుప్పటి తీసి కప్పుకోబోతూ చటుక్కున ఆగేడు. దుప్పటి కొసలు చుట్టూ వేళ్ళు బిగుసు కొన్నాయి. కలుగులోంచి కొద్దిగా తల బైటికి పెట్టి ఎలుక అతనివైపే చూస్తూ వుంది. అతనూ కన్నార్పకుండా సూటిగా చూడసాగేడు? నిమిషం గడిచినా ఎవరూ కదల్లేదు. భానుమూర్తి ఉక్రోషం పెరిగి, నాలుక బైటపెట్టి "దొద్దోద్దు" అని వెక్కిరించాడు. ఎలుక మాత్రం కదలకుండా "నీలాంటి

వాళ్ళని చాలామందిని చూసేంలే" అన్నట్లు కుడివైపు మీసాన్ని గాలిలో కొద్దిగా అల్లల్లాడించింది.

"హుష్" అన్నాడు తర్జని చూపిస్తూ.

అది మాత్రం బెదరకుండా ఒక కన్నుతో అతన్నే చూస్తూ రెండో కన్ను అలవోకగా ఒకసారి మూసి తెరిచి మూతిని సున్నాచుట్టి ముందుకు చాపింది.

భానుమూర్తికి ఒళ్ళుమండి "హుష్" అన్నాడు. మళ్ళీ అది కదల్లేదు. చేత్తో మంచాన్ని గట్టిగా కొట్టేడు. దాని చప్పుడికి అది లోపలికి పరుగెత్తింది. కానీ చిట్టి నిద్రలో బెదిరిపోయి గుక్కపట్టింది. దాన్ని సముదాయించి పడుకోబెట్టేసరికి తలప్రాణం తోకకు వచ్చింది.

* * *

ఆ రాత్రి అతనికో చిత్రమైన కల వచ్చింది.

నాలుగైదు ఎలుకలు, పెద్ద గున్న ఏనుగుల్లా వున్నాయి. భయంకరంగా గర్జిస్తూ తరుముతున్నాయి. అతడు పెద్ద అంకుశంతో నిలబడి వాటిని అదిలిస్తున్నాడు.

ఆ కల అతడిని అంతగా సంతోషపెట్టలేదు. ఎందుకంటే - ఎలుకలు బయటా, అతను బోనులోను వున్నారు. పైగా ఆ దృశ్యంలో అతడు మరీ రెండడుగుల లిల్లీపుట్ లా వున్నాడు.

రాత్రి సరిగ్గా నిద్రలేకపోవటం వలన మరుసటి రోజు ప్రొద్దున్నే కొద్దిగా ఆలస్యంగా అతడు లేచేసరికి ఇల్లంతా హడావిడిగా వుంది సామాన్లు అస్తవ్యస్తంగా వున్నాయి. సీత అటూ యిటూ తిరుగుతూ హడావుడిగా వెతికేస్తోంది. భర్తను చూడగానే దాదాపు ఏడుస్తున్నట్లు "ఏమండీ మంగళ సూత్రాలు.....సూత్రాలు కనబడటం లేదండీ" అంది.

భానుమూర్తి కంగారుగా "ఎక్కడ పారేసేవ్" అన్నాడు.

"గూట్లో పెట్టేను. మళ్ళీ వచ్చి చూసేసరికి లేవు."

అతను కూడా వెతకటం మొదలుపెట్టేడు. అరగంట వెతికినా ఫలితం కనబడలేదు.

అంతలో అతనికి ఓ ఆలోచన స్ఫురించింది.

పెరట్లోకి పరుగెత్తుకెళ్ళి చిన్న గునపం లాంటిది పట్టుకొచ్చి ముంగాళ్ళమీద కూర్చొని ఎలుక కన్నాన్ని త్రవ్వసాగేడు. సీతా, చిట్టి అతని పక్కనేచేరి ఆసక్తిగా చూస్తున్నారు. రెండు నిమిషాలకల్లా అతని ప్రయత్నం ఫలించింది. సీత మొహం చేటంత అయింది. సూత్రాలు కళ్ళ కద్దుకొని ఎలుకని శాపనార్థాలు పెడుతూ లోపలికి వెళ్ళిపోయింది.

కలుగులో ఇంకా ఏమైనా వున్నాయేమోనని పరిశీలనగా చూసేడు. కొద్దిగా శనగపప్పు, చిన్న విరిగిన దువ్వెనా, ఉల్లితొక్కలూ, చిట్టి చిన్నప్పటి ప్లాస్టిక్ బొమ్మ ఉన్నాయి. దాన్ని బ్రెజిల్ హంట్ చేసేమన్న సంతృప్తితో అతడు లేస్తూ వుండగా "ఎలుక లేదేం నాన్నా?' ' అంది చిట్టి.

"దాని ఆస్తంతా కొల్లగొట్టేసేం కదమ్మా. తిరిగి వచ్చి ఓసారి చూచుకుని భోరున ఏడ్చేస్తుంది" అన్నాడు ఆఫీసుకు వెళ్ళటం కోసం మొదటి కార్యక్రమాన్ని మొదలుపెడ్తు.

....ఆరోజు సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికొస్తు ఎలుకల మందు కొనుక్కొచ్చేడు భానుమూర్తి. ఆఫీసవగానే సరాసరి ఇంటికొచ్చేయడం అతనికి అలవాటు. ప్రతిరోజూ రాగానే సరాసరి ఆ రోజు స్నానంచేసి పేపరు చదువుకుంటూ ఉండగా చిట్టి అతని దగ్గరికి వచ్చింది. చేతిలో చిన్న బొమ్మని అతడికి చూపిస్తు. "అమ్మ మధ్యాహ్నం కొన్నది నాన్నా" అంది.

"ఏమిటమ్మా?" అన్నాడు.

"మా పాప నాన్నా."

భానుమూర్తి నవ్వి "మంచిది. ఆడుకో అమ్మా" అన్నాడు. ఓ పావుగంట గడిచేక మళ్ళీ అతని దగ్గరకు వస్తూ "నేను, పాపా తినేసేం నాన్నా" నములుతూనే - అంది చిన్న చిన్న వుండల్ని అతని చేతిలో పెడ్తూ.

"వద్దు లేమ్మా-" అన్నాడు,

"పేరంటం నాన్నా నువ్వూ తిను."

"మైదాపిండి అంతా ఇలా పాడుచేస్తున్నావా" అన్నాడు మందలిస్తున్నట్టు. చిట్టి బెదిరింది. "అబ్బే - అదికాదు నాన్నా, నువ్వుతెచ్చి గూట్లో పెట్టేవు అదీ" అంది.

....అరగంట తరువాత అతను నర్సింగ్ హోమ్‌లో చేతులు కట్టుకొని విచారంగా, ఆతృతగా పచార్లు చేస్తున్నాడు. సీత బల్లమీద కూర్చొని కొంగు నోట్లో కుక్కుకొని, ఏడుపు బయటికి రాకుండా అదిమి పెడ్తోంది.

అక్కడున్న నిశ్శబ్దం శ్మశానం గుర్తుకు తెస్తోంది. బయటున్న చీకటి అతడి మనసులోనే వుంది. విశాలంగావున్న నర్సింగ్‌హోమ్ డబ్బున్నవాడి మనసులో కోర్కెలా పరచుకొని వుంది.

అయిదు నిమిషాలు గడిచేసరికి, స్ప్రింగ్ డోర్స్ తెరుచుకున్నాయి. ఇద్దరూ ఆతృతగా దగ్గరకు వెళ్ళేరు.

డాక్టరు వెనుకే నడిచివస్తోన్న చిట్టిని చూడగానే సీత మొహం వికసించింది. పరుగున వెళ్ళి దగ్గిరకు తీసుకుంది.

"ఏం ఫర్వాలేదుగా డాక్టర్" అన్నాడు భానుమూర్తి.

"షీ ఈజ్ పెర్‌ఫెక్టులీ ఆల్‌రైట్. మీరే చూడండి" అన్నాడు డాక్టర్. అతడు చెప్పింది నిజమే అనిపించింది. చిట్టి మొహంలో అలసట తప్ప ఇంకేమీ కనబడలేదు.

కూతుర్ని తీసుకొని దంపతులిద్దరూ బయటకొచ్చేరు. భానుమూర్తి చిట్టిని ఎత్తుకొన్నాడు. సీత అతని వెనుకే నడుస్తూంది. ఎవరి ఆలోచనల్లో వారున్నారు.

నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ "ఎలుక మనకి చాలా సాయంచేసింది" అన్నాడు భానుమూర్తి. "ఏమిటి" అంది అర్థంకానట్టు సీత.

"ఆ మంగళ సూత్రాన్ని అది ఇంకెక్కడన్నా దాచివుంటే ఇప్పుడేవి తాకట్టు పెట్టి వుండేవాళ్ళం?-"

సీత మాట్లాడలేదు. వీధి దీపాలు సామాన్యుడి భవిష్యత్తుల్లా మినుక్కు

మినుక్కుమని వెలుగుతున్నాయి. నడుస్తున్నదల్లా ఆగి.

"రేపు భోజనం పెట్టవచ్చో లేదో అడగలేదండీ" అంది సీత.

"అవును సుమా" అని భుజంమీద నుంచి చిట్టిని ఆమెకి అందించి "మీరు వెళ్ళండి, నేను అడిగివస్తాను" అని వెనుదిరిగేడు భానుమూర్తి.

అతను నర్సింగ్ హోమ్ చేరుకునేసరికి దూరంగా పది కొట్టింది. ఎత్తయిన వృక్షాలు నిద్రపోవటానికి సిద్ధపడుతున్నాయి. హాస్పిటల్ - రాత్రి మూడు తర్వాత బ్రోతల్ హౌస్‌లా వుంది. వరండా చీకటిని కన్సెల్టింగ్ రూమ్‌లోంచి పడే వెల్తురు పోగొడ్తోంది. నల్లపిల్లిలావున్న డాక్టర్ వళ్ళో తెల్లబట్టల నర్సు ఒదిగి కూర్చుని వుంది.

భానుమూర్తి సందిగ్ధంలో పడ్డాడు. లోపల డాక్టరు నవ్వు తెరలు తెరలుగా వినిపిస్తోంది. ఏం చెయ్యాలో తోచక నిలబడ్డ అతని సందిగ్ధాన్ని డాక్టరే లోపల్నుంచే పోగొట్టేడు.

-పాపం పిచ్చివాళ్ళు- కొంచెం లాలనగా అడిగివుంటే పాప చెప్పేది. బెదిరించేసరికి మైదాపిండి కాదు. ఈ పొట్లం అందట- మళ్ళీ నవ్వు.

తెల్లబడిన మొహంతో నల్లటి చీకట్లో కలిసిపోయేడు భానుమూర్తి-

"నువ్వు నన్నే అంటావేమిటి?"

"మరి డబాయించి ఇచ్చిన డబ్బులు వసూలు చేయలేకపోయారా?"

"ఏవో ఇంజక్షన్లు అవీ ఇచ్చేనంటాడు. మన మాట వినేదెవరు" భర్త వాదనలో నిజం కనబడటంతో సీత మరి మాట్లాడలేదు. భోజనం చెయ్యకుండానే పడుకున్నారిద్దరూ. చిట్టి నిస్త్రాణగా నిద్రపోతోంది.

"ఈ మధ్య మీరు అదోలా ఉంటున్నారు" పడుకున్న తరువాత అడిగింది సీత.

భానుమూర్తి పెదవులమీద జీవంలేని నవ్వుతో "ఎలా ఉన్నాను?" అన్నాడు.

"పెళ్ళయిన కొత్తలోలా లేరు."

ఈసారి నిజంగానే నవ్వొచ్చిందతనికి. "ఎప్పుడూ ఒకేలా ఉండటం ఎలా కుదురుతుంది?" అన్నాడు నవ్వుతూనే. అంతలో అతని కంఠం ఆలోచనా పూరితంగా మారింది. "కొత్తలో యంత్రం హుషారుగా పని చేస్తోంది. ఆ శక్తిని వాడుకొనే అది అరిగిపోతుంది. ఇందులో అసహజం ఏముంది?"

"అలా మాట్లాడకండి. భయంవేస్తుంది" అంది సీత బేలగా.

".ఇంత దానికి భయపడిపోతే ఎలా? తొందర్లో ఇంకో వార్త!" సీత బెదిరి "ఏమిటి?' 'అంది.

"మనకి తొందర్లోనే ఏజన్సీ ఏరియాకి ట్రాన్స్‌ఫర్ అవబోతోంది."

ఆమె మొహం రక్తం లేనట్టు తెల్లగా పాలిపోయింది. తనలో తనే గొణుక్కుంటున్నట్లు "ఏజన్సీ--అంటే--" అంది. మలేరియా వస్తుందంటారు, అదేగా?"

వాతావరణాన్ని తేలికపర్చటానికి అతడు నవ్వి, "పూర్వం ఒకచోట వనరులు అయిపోగానే ఇంకో చోటుకు వలస పోయేవారట. మనం అలాగే అనుకుందాం" అన్నాడు.

సీత నవ్వే స్థితిలో లేదు. అటు తిరిగి పడుకొంది. అతడి మనసు చివుక్కుమంది. ప్రతీదీ అందరూ తన చేతగానితనంగా అనుకుంటారెందుకో అర్థం కాలేదు. ఆ ఆలోచనతోనే అతనికి చాలాసేపటి వరకూ నిద్రపట్టలేదు.

ఆ మరుసటిరోజు ఆఫీసుకి వెళుతూవుండగా దారిలో భాస్కరరావు కలిసేడు.

"ఈరోజు టాన్స్‌ఫర్ విషయం తేల్తుందనుకుంటా" అన్నాడు.

"ఎలా?" అన్నాడు భానుమూర్తి.

"దాసు ఈ రోజు వచ్చాడు."

దాసు భానుమూర్తికన్నా జూనియర్. నిజానికి అతనికి అవ్వాలి ట్రాన్స్‌ఫర్. కానీ బాగా ఇన్ఫ్లుయన్సు ఉన్న మనిషి అతడు. వెళ్ళి తనకు రాకుండా ప్రయత్నం చేసుకున్నాడు.

భానుమూర్తి నిట్టూర్చి "ఎలా జరుగుతుందో అలా జరగనీ మనమేం చేస్తాం?" అన్నాడు. అన్నింటికీ తెగించినవాడి ధైర్యం అతడిలో కనబడుతోంది. మళ్ళీ అంతలోనే నిరాశే.... 'వెధవ బ్రతుకు. ప్రతిక్షణం ఏమవుతుందోనని అనుకుంటూ బతకటమే. సెక్యూరిటీలేదు' అనుకున్నాడు.

మధ్యాహ్నం పోస్టు వచ్చిన తరువాత, ఆఫీసరు రమ్మంటున్నారంటూ వచ్చేడు ప్యూను. భానుమూర్తి లోపలకు వెళ్ళాడు. అతన్ని చూసి ఆఫీసరు నవ్వుతూ "రావోయ్‌రా, కూర్చో" అన్నాడు. ఈ విపరీత పరిణామానికి అతడు ఆశ్చర్యపోతూ అప్రయత్నంగా కూర్చున్నాడు.

"కంగ్రాచ్యులేషన్సోయ్! నీ సిన్సియారిటీకి, నేను వ్రాసిన రిపోర్టులకి గుర్తింపు కలిగింది. ఇదిగో ప్రమోషను ఆర్డర్సు-"

భానుమూర్తికి అది కలో నిజమో అర్థం కాలేదు. ఏదో మైకంలో ఉన్నవాడిలా ఆఫీసరుకి షేక్‌హ్యాండ్ ఇచ్చి బయటకు వచ్చేడు.

క్షణంలో ఆఫీసు అట్మాస్ఫియరు మారిపోయింది. అందరూ వచ్చి అభినందనలు తెలిపేరు. పట్టుబట్టి లంచ్ అవర్‌లో అతని దగ్గర పార్టీ తీసుకున్నారు. నిజానికి భానుమూర్తికి ఆఫీసులో మంచి వర్కర్ అని పేరుంది. అతని ప్రమోషన్‌కి ఈర్ష్యపడే వాళ్లెవ్వరూ లేరు.

ఆ రోజు ఆఫీసులో పని జరగలేదు.

"విషాదపు, సంతోషాల మధ్య మన జీవితాలు ఎలా 'ఆసిలేట్' అవుతాయో" అన్నాడు భాస్కరరావు సాయంకాలం ఇంటికొస్తున్నప్పుడు భానుమూర్తి నవ్వేడు. అతని మనస్సు దూదికన్నా తేలికగా వుంది. ప్రమోషన్‌కన్నా పుట్టి పెరిగిన ఊరు వదలక్కర్లేదనే విషయం అతనికి ఎక్కువ సంతోషాన్నిస్తోంది.

దారిలో ఆగి చిట్టికి స్వీట్స్, సీతకి మల్లెపూలు కొన్నాడు.

ఇంటికొచ్చేసరికి ముందు హాల్లో ఎవరూ లేరు. అంతా నిశ్శబ్దముగా వుంది. పక్క గది గుమ్మం దగ్గర నిలబడి ఉన్న సీత అతడ్ని చూసి పక్కకు ఒరిగి చూస్తూ "ఎలుకను పిల్లి కొట్టిందండీ! మమ్మల్ని చూసి పారిపోయింది" అంది.

గుమ్మం దగ్గిర నిలబడి లోపలికి చూశాడు.

గది మధ్యలో పడి వుంది ఎలుక. చావు బ్రతుకుల మధ్య ఊగిసలాడుతోంది. వీపుమీద చర్మం మధ్యకి తెగిపోయి లోపల్నుంచి కండ ఎర్రగా కనిపిస్తోంది. ప్రాణాన్ని వదిలేస్తున్నప్పటి భాధని శరీరం నిశ్శబ్దంగా భరిస్తోందనటానికి గుర్తుగా తోక నెమ్మదిగా కదులుతోంది. కాళ్ళతో నేలని అదిమిపెట్టడానికి విఫలప్రయత్నం చేస్తోంది. లాభం లేదన్నట్లు దానికీ తెలిసిపోయింది.

భానుమూర్తి కన్నార్పకుండా నిశ్చలంగా నిలబడి దాన్నే చూస్తున్నాడు. అది కళ్ళు తెరిచింది. రెండుకళ్ళూ కలుసుకున్నాయి. "వెళ్ళొస్తాను. ప్రియమిత్రుడా !" అన్నట్లు జాలిగా, ఆర్తిగా ఉందా చూపు. నెమ్మదిగా దాని రెప్పలు మూసుకుపోయాయి, చలనం ఆగిపోయింది. సకల చరాచర సృష్టి, స్థితి, లయకారుని ఆత్మలో లీనం అవటానికి ఆ చిన్న జీవి ప్రాణం దిగంతాలకు పయనించింది. నిట్రాడలా నిలబడే ఉన్నాడు భానుమూర్తి.

ఏదో చెప్పడానికి తండ్రివేపు తిరిగిన చిట్టీ, చప్పున తల్లి వేపు తిరిగి, "అమ్మా! నాన్నేడుస్తున్నాడేవ్!" అంది.

❁ ❁ ❁

**(స్వాతి - 1977)**